AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
31-12-2025 (Wednesday)
MAIN EDITION

## న్యూ ఇయర్ వేడుకల వేళ సీపీ సజ్జనార్ కీలక సూచనలు



**అక్షరటుడే, హైదరాబాద్:** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పౌరులకు సూచించారు. క్యాబ్, ఆటో డ్రైవర్లు రైడ్‌కు నిరాకరించడం, బుక్ చేసిన ఛార్జ్ కంటే అధికంగా డబ్బులు డిమాండ్ చేయడం వంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏదైనా ఇబ్బంది తలెత్తితే హైదరాబాద్ సిటీ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555కు కాల్ చేయాలని లేదా మెసేజ్ పంపించాలని సీపీ సూచించారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతా వేదికగా ప్రకటన చేశారు.

## బొలెరో వాహనంలో మంటలు.. ఒకరి సజీవ దహనం

**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బొలెరో వాహనంలో మంటలు చెలరేగడంతో ఓ వ్యక్తి సజీవ దహనం అయ్యాడు. ప్రకాశం జిల్లా రాచర్ల రంగారెడ్డి పల్లె వద్ద అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. తుని నుంచి జీడిపప్పు లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొంది. దీంతో బొలెరోలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో డ్రైవర్ అనంతపురం జిల్లాకు చెందిన స్వామి సజీవ దహనం అయ్యాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో మరో వ్యక్తి గాయపడగా.. ఆస్పత్రికి తరలించారు.

## వొడాఫోన్ – ఐడియాకు ఉపశమనం




**అక్షరటుడే, ఢిల్లీ:** వొడాఫోన్-ఐడియాకు ఉపశమనం కల్పిస్తూ కేంద్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయ (ఏజీఆర్) బకాయిలు రూ.87,695 కోట్లను ఫ్రీజ్ చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 2032-41 మధ్య ఆ బకాయిలు చెల్లించేలా వెసులుబాటు కల్పించింది.

## వార్షిక రిటర్న్‌ల దాఖలు గడువు పెంపు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** గత ఆర్థిక సంవత్సరానికి (2024-25) సంబంధించిన కంపెనీల వార్షిక రిటర్నులు, ఆర్థిక నివేదికల సమర్పణ గడువును కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పొడిగించింది. ఉత్తర్వుల ప్రకారం.. కంపెనీలు తమ ఫైలింగ్‌లను 2026 జనవరి 31లోగా పూర్తి చేయాలి. వాస్తవానికి ఈ గడువు ఈనెల 31తో ముగియనుండగా, పొడిగించారు.

## గిగ్ వర్కర్లకు ప్రోత్సాహకాల పెంపు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** గిగ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో డెలివరీ ఏజెంట్లకు స్విగ్గీ, జొమాటో ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాయి. ఏడాది చివరిరోజు కార్యకలాపాలకు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశంతో ప్రోత్సాహకాలను పెంచాయి. పని పరిస్థితులు, సామాజిక భద్రత వంటి అంశాలపై గిగ్ వర్కర్లు సమ్మెకు దిగిన వేళ.. కంపెనీలు ఈ ప్రకటన చేయడం గమనార్హం.

**రాష్ట్రంలో అవినీతి అధికారులపై ఏసీబీ ఉక్కుపాదం మోపుతోంది. లంచాలు తీసుకుంటున్న వారిని వల పన్ని పట్టుకుంటోంది. అవినీతి కేంద్రాలకు మారిన కార్యాలయలపై ఆకస్మిక సోదాలు చేపడుతోంది. రూ.కోట్లలో అక్రమాస్తులు కూడబెట్టిన వారి పని పడుతోంది. అవినీతి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. లంచాలు తీసుకేనే వారి పని పడుతోంది. ఈ ఏడాదిలో ఏకంగా 199 కేసులు నమోదు చేసింది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా వార్షిక నివేదికను విడుదల చేశారు.**

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# ఏసీబీ దూకుడు..



- రాష్ట్రంలో ఏడాదిలో 199 కేసులు నమోదు
- లంచం తీసుకుంటూ చిక్కిన 176 మంది ప్రభుత్వ ఉద్యోగులు
- అవినీతి నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు

రాష్ట్రంలో ఇటీవల ఏసీబీ కేసులు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. 2025లో మొత్తం 199 కేసులను నమోదు చేయగా, 273 మంది నిందితులను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. వీటిలో 157 ట్రాప్ కేసులు ఉన్నాయి. లంచం తీసుకుంటుండగా.. 224 మంది నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిలో 176 మంది ప్రభుత్వ ఉద్యోగులు కాగా.. మిగతా వారు ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ప్రైవేట్ వ్యక్తులు ఉన్నారు.

### అవినీతి తిమింగలాల ఆటకట్టు

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అవినీతి అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్న ఏసీబీ.. పలు శాఖల్లోని పెద్ద పెద్ద అవినీతి తిమింగలాల అక్రమాస్తులను సైతం బయట పెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అక్రమాలకు పాల్పడిన ఇద్దరిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. ఇటీవల మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషన్ ఇళ్లలో సోదాలు చేసి రూ.వందల కోట్ల అక్రమాస్తులను గుర్తించింది. ఈ ఏడాది ఏసీబీ ప్రభుత్వ ఉద్యోగులపై అక్రమ ఆస్తులకు సంబంధించిన 15 కేసులు నమోదు చేసింది. నేరపూరిత దుష్ప్రవర్తనకు సంబంధించిన 26 ఇతర కేసులు పెట్టింది. వీటిలో 34 మంది నిందితులను అరెస్టు చేశారు.

### తనిఖీలతో హడల్

గతంలో ప్రజలు, అధికారులు ఫిర్యాదు చేస్తేనే అధికారులను ఏసీబీ పట్టుకునేది. అయితే ఇటీవల ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్నారు. ఈ ఏడాది 26 రెగ్యులర్ ఎంక్వైరీలు నిర్వహించింది. వివిధ కార్యాలయాల్లో 54 ఆకస్మిక తనిఖీలు చేసింది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆర్టీఏ చెక్ పోస్టులు, వివిధ సంక్షేమ హాస్టళ్లలో సైతం తనిఖీలు చేయడం గమనార్హం. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాల్లో ఏసీబీ తనిఖీలు చేసి, ప్రభుత్వానికి నివేదికలు పంపింది. ఆర్టీఏ చెక్‌పోస్టులను తనిఖీ చేసి భారీగా అవినీతి జరుగుతున్నట్లు గుర్తించడంతో ప్రభుత్వం వాటిని మూసివేసిన విషయం తెలిసిందే.

### సిబ్బందికి శిక్షణ

ఈ ఏడాది ఏసీబీ సిబ్బందికి శిక్షణ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. 73 మంది అధికారులకు ప్రాథమిక ఇండక్షన్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ, నిందితులు/అనుమానిత అధికారుల ప్రొఫైల్‌ల తయారీ, నిఘా పద్ధతులు, బినామీ ఆస్తుల చట్టం, ఆర్థిక లావాదేవీలను గుర్తించడంపై దర్యాప్తు, ఆర్థిక లావాదేవీల డిజిటల్ పాదముద్రలు, ట్రాప్ & DA కేసులలో చట్టపరమైన స్థానం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.


### ప్రజలకు అవగాహన

ఏసీబీ అధికారులు అవినీతిని నిర్మూలించడమే లక్ష్యగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గతంలో స్టిక్కర్లు అతికించారు. డిసెంబర్ 3 నుంచి 9 వరకు అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహించారు. క్యూఆర్ కోడ్ ద్వారా అవినీతిపై ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. అవినీతి నిర్మూలనపై అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ఎవరైనా లంచం అడిగితే 1064 (టోల్ ఫ్రీ నంబర్) కు కాల్ చేయాలని, లేదంటే వాట్సాప్ (9440446106) లో ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

### భారీగా నగదు స్వాధీనం

నిందితులపై విచారణ కోసం ఏసీబీ ప్రభుత్వం నుంచి 115 మంజూరు ఉత్తర్వులను పొంది, చార్జిషీట్లు దాఖలు చేసింది. 2025లో నమోదైన ట్రాప్ కేసుల్లో మొత్తం రూ. 57,17,500 నగదు స్వాధీనం చేసుకుంది. అందులో రూ. 35,89,500 ఫిర్యాదుదారులకు తిరిగి చెల్లించింది. 15 కేసుల్లో రూ.96,13,50,554 విలువైన ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించింది. అయితే బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ భారీగా ఉంటుంది.

## రేపటి నుంచి తగ్గనున్న చలి




**అక్షరటుడే, హైదరాబాద్:** చలితో వణికిపోతున్న ప్రజలకు వాతావరణ శాఖ అధికారులు వెచ్చని కబురు చెప్పారు. రేపటి నుంచి చలితీవ్రత తగ్గుతుందని తెలిపారు. శీతాకాలం సీజన్ ప్రారంభం అయిన నాటి నుంచి చలి తీవ్రతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా నవంబర్ రెండో వారం నుంచే చలి పంజా విసిరింది. మధ్యలో వారం రోజులు మినహా ఇప్పటి వరకు చలి ప్రభావం విపరీతంగా ఉంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు విపరీతంగా పడిపోయాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పరిమితం కావడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం సైతం శీతల గాలులు వీచాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడ్డారు. రాష్ట్రంలో 25 రోజులుగా కోల్డ్ వేవ్ కొనసాగుతోంది. నేటితో కోల్డ్ వేవ్ ముగుస్తుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొత్త సంవత్సరంలో చలి తీవ్రత తగ్గుతుందని పేర్కొన్నారు. జనవరి 1 నుంచి 6 వరకు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు.

## యూట్యూబర్ అన్వేష్‌పై కేసులు




**అక్షరటుడే, హైదరాబాద్:** యూట్యూబర్ అన్వేష్‌పై తెలంగాణ వ్యాప్తంగా కేసులు నమోదవుతున్నాయి. ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలను హిందూ సంఘాల నాయకులు ఖండిస్తున్నారు. నటుడు శివాజీ ఇటీవల దండోరా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణపై వివాదా స్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై యూట్యూబర్ అన్వేష్ స్పందిస్తూ హిందూ దేవతలు సీత, ద్రౌపదిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. దీనిపై వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్‌లో పాటు హిందువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతడిపై కేసులు నమోదు పెడుతున్నారు. అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సినీ నటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి అన్వేష్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అలాగే ఖమ్మంలో సైతం అన్వేష్‌పై కేసు నమోదైంది.



## ఢిల్లీని కమ్మేసిన పొగమంచు..


**అక్షరటుడే, ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో పాటు ఉత్తరాది రాష్ట్రాల్లో పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ పడిపోయింది. ఉదయం 10 గంటల వరకు కూడా పొగమంచు వీడడం లేదు. పొగమంచు కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 148 విమానాలు రద్దయ్యాయి. అనేక విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. కొన్ని విమానాలను అధికారులు దారి మళ్లించారు. గాలినాణ్యత 400 పాయింట్లకు పడిపోవడంతో రెడ్ అలర్ట్ జారీ చేశారు. డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో గాలి నాణ్యత 'తీవ్రమైన' కేటగిరీలోకి జారిపోయే అవకాశం ఉందని, జనవరి 2న చాలా పేలవంగా ఉండే అవకాశం ఉందని ఎయిర్ క్వాలిటీ అధికారులు హెచ్చరించారు.

## ఉక్రెయిన్‌లో బఫర్ జోన్ విస్తరణకు పుతిన్ ఆదేశాలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కొన్ని రోజులుగా ఉక్రెయిన్‌పై భారీగా విరుచుకుపడుతున్న రష్యా తాజాగా ఆ దేశంపై మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. ఉక్రెయిన్‌కు చెందిన భూభాగాన్ని మరింత ఆక్రమించుకోవడానికి చర్యలు చేపట్టింది. వచ్చే ఏడాదిలో ఉక్రెయిన్‌లో బఫర్ జోన్ పెంచమని తమ దేశాధ్యక్షుడు పుతిన్ ఆదేశించినట్లు రష్యా జనరల్ వాలేరి గెరసిమోవ్ వెల్లడించారు. దీంతో రష్యా దళాలు సుమీ, ఖర్కీవ్ ప్రాంతాల్లోని గ్రామాలను ఆక్రమించుకుంటూ మరింత ముందుకుసాగడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. ఇటీవల పుతిన్ ఇంటిపై డ్రోన్లతో దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించిన వేళ ఈ ఆదేశాలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## స్టార్ హోటల్‌పై 50 మంది దాడి




**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో హైటెన్షన్ నెలకొంది. ఓ స్టార్ హోటల్‌పై 50 మంది దాడి చేశారు. గచ్చిబౌలిలోని హోటల్ థార్ తంగరిన్‌పై బుధవారం ఉదయం కొంతమంది దాడి చేశారు. హోటల్‌లోకి చొరబడి ఫర్నీచర్, అద్దాలు ధ్వంసం చేశారు. బస చేసిన అతిథులను బలవంతంగా గదుల నుంచి ఖాళీ చేయించారు. దీంతో వారు ప్రాణభయంతో రోడ్డుపైకి వచ్చారు. లీజుదారుడికి, బిల్డింగ్ యజమానికి మధ్య వివాదమే దాడికి కారణమని సమాచారం.

## ఎస్ఎస్ఎల్వీ మూడో దశ పరీక్ష సక్సెస్

**అక్షరటుడే, ఏపీ:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో ఘనత సాధించింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ మూడో దశ పరీక్షలను విజయవంతంగా చేపట్టింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని ఇస్రో ఈ ప్రయోగం చేపట్టింది. తాజా పరీక్షలో కొత్త కార్బన్ఎపాక్సీ మోటార్ పనితీరును పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. అప్‌గ్రేడ్ చేసిన దశలో మెరుగైన ఇగ్నైటర్, నాజిల్ డిజైన్ ఉంటుంది. దీంతో సామర్థ్యం నిర్మాణాత్మక దృఢత్వాన్ని పెంచుతుంది. 108 సెకన్ల పరీక్షలో పీడనం, థ్రస్ట్, ఉష్ణోగ్రత, కంపనం, యాక్చుయేటర్ పనితీరు వంటి అంశాలను పరీక్షించారు. ఇవన్నీ అధికారుల అంచనాలకు సరిపోలడంతో పరీక్ష విజయవంతమైనట్లు ప్రకటించారు.

## డెబ్యూ ప్రాజెక్టుతో రిస్క్ చేస్తున్న భామ



**బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్, మిలాప్ జవేరి కలయికలో ఓ యాక్షన్ పాక్డ్ మూవీ రాబోతున్న విషయం తెలిసిందే. అయితే వీరిద్దరి ట్రాక్ రికార్డు గత కొన్ని సినిమాలుగా బాలేదు. అలాంటి వారిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్టు ఇప్పుడు బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే ఇలాంటి సినిమా తో ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి బాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వనుంది. కృతి తెలుగు, తమిళ భాషల్లో పలు సినిమాలు చేయగా.. బాలీవుడ్‌లోకి వెళ్లనున్నారు. గతంలో ఈ భామ హృతిక్ రోషన్ సూపర్ 30లో నటించినా.. అందులో కృతి లీడ్ రోల్ కాదు. అందుకే కృతి ఈ సినిమాతోనే బాలీ వుడ్ డెబ్యూ చేయనుందని అందరూ భావి స్తున్నారు. అయితే ఈ విషయంలో కృతి డెసిషన్ కరెక్ట్ కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పైగా ఇప్పటివరకు టైగర్ ష్రాఫ్ తో కలిసి డెబ్యూ చేసిన హీరోయిన్ల ట్రాక్ రికార్డు చూసుకుంటే.. కృతి రిస్క్ తీసుకుంటున్నట్టే అనిపిస్తోందని అంటున్నారు.**

—అక్షరటుడే, సినిమాడెస్క్